# శహన

ఈ అయిదు రోజులు అంగ రంగ వైభవంగా జరిగిన వివాహ వేడుకలు భరత వాక్యం అప్పగింతలకు చేరుకున్నాయి. ఆ సమయానికి అక్కడికి లగ్నం వేళకు వచ్చిన జనం కంటె ఎక్కువ మంది వచ్చారు.

నిన్నటి దాకా చూడముచ్చట.

ఈ పూట మాత్రం వినవేడుక.

అందరినీ ఆకర్షించింది, ఆకట్టుకున్నది శుభలేఖలోని చివరి వాక్యం.

'నాదస్వరం జి. సింగారవేలు అండ్ పార్టీ, మదరాసు.'

పది సంవత్సరాల క్రితం ఒక వివాహంలో ఈ వూళ్ళో వాయించినప్పుడు తన నైపుణ్యంతో అందరినీ ఆకట్టుకున్నాడు.

ముఖ్యంగా రెండు పాటలు...

ఒకటి నవ్వు తెప్పించింది... అలకపానుపు దగ్గర వాయించిన పాట 'జగమే మాయ.'

ఆ పాట వింటూ జనం నవ్వడం ఇది మొదటిసారి కావచ్చు.

"ఎందుకు ఈపాట వాయించావు" అని అడిగితే "మీ తెలుగు పాటలలో నాకు చాలా ఇష్టమైన పాట. చాలా గొప్ప పాట" అని సమాధానం చెప్పాడు.

రెండవది- అప్పగింతల పాట. ఆపాట ఒక్కదానికి ఇవ్వవచ్చు అతనికి వచ్చిన బిరుదు ఇసైమన్నార్, సంగీత చక్రవర్తి.

ఆపాట విని, కంట తడిపెట్టని స్త్రీ లేదు.

మనస్సు గద్గదం కాని మగవాడు లేదు.

పది సంవత్సరాల తరువాత ఈనాడు మళ్ళీ ఈ నగరాన్ని, సంగీత ప్రియులను అలరించడానికి, ఆనందింపచేయడానికి వచ్చాడు.

కాని....

తమకు తెలిసిన వ్యక్తికీ, తాము చూస్తున్న వ్యక్తికీ పోలికలేదు. పది సంవత్సరాలలో వంద సంవత్సరాల వృద్ధాప్యం - అకాలంలో వచ్చింది.

మారనిదల్లా - అతని సంగీతం!

అప్సరస లాంటి అందాల భరిణను మన్మధుడిలాంటి చిన్నవాడికి అప్పగించే తరుణం ఆసన్న మైంది.

అప్పగింతలకి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

జంట వాయిద్యగాడు సన్నాయిమీద రాగం ఆలాపన చేస్తున్నాడు.

క్షణంలో అక్కడి కిలకిలలు పకపకలు రవ్వంత సద్దు మణిగినా -

చిన్నవారిలో - చిరునవ్వులు చిద్విలాసాలు చిందులాడుతూ వున్నా...

తమ జీవితంలో కన్నవారి ఇల్లు వదిలి మెట్టినింటికి ప్రయాణమైన ఆ ఘట్టం కన్నుల ముందు కదలి రాగానే ఎందరో భద్రమహిళల మనస్సు మూగ బోయింది.

కాటుక చెరిగిపోతుందని, పౌడరు కరిగిపోతుందని మనస్సు చెవిని యిల్లు కట్టుకొని పోరినా - హృదయం మాట వినక పోయేసరికి

కన్నీరు కడలిలా కదలి వచ్చింది.

నలుగురిలో శోకం వ్యక్త పరిచే అధికారం లేని మగ మహారాజులు మనస్సు పతంజలి మీద నిలిపి...

"చిత్త వృత్తినిరోధః యోగః" అంటూ పదే పదే గుర్తు చేసుకుంటున్నా...

శహనా రాగంలో 'పోయి రావే తల్లి' అన్నపాటను తలుచుకుంటూ వుంటే వారి కళ్ళు పొడిగా వుండటం లేదు.

కొందరి చూపులు అనంతాన్ని దాటి వుంటే మరి కొందరు అంతర్ముఖులైలో వెలుగులని వెతుక్కుంటున్నారు.

ఎల్ల దిక్కులా నిశ్శబ్దం...

ఆ నిశ్శబ్ద సాగరంలో విషాద సంగీతం.

అందరి దృష్టి సింగార వేలుపై నిలిచి వుంది.

అతగాడు సమాధిలో వున్న ఋషిలాగా ఉన్నాడు.

అన్ని దిక్కులా శబ్దం. ఆదిక్కున నిశ్శబ్దం....

గురువుగారేమో ఈ తీరున వున్నారు. రాగాలాపన మాని పాట మొదలు పెట్టడానికి రెండవ సన్నాయి ఇటువైపు చూస్తోంది. వంటబ్రాహ్మడు అనంత రామయ్య- మగపెళ్లివారికి ఇవ్వవలసిన లడ్డూలు ప్యాకెట్లలో పెడుతున్నాడు.

శహానా వినిపిస్తోంది. మనస్సు ఎక్కడో వుంది... ఏకోశాన్నా సంతోషంలేదు.

అనుక్షణం తన కూతురు సుశీల గుర్తుకు వస్తోంది.

పెళ్ళి బట్టలు, కళ్యాణం బొట్టు, బుగ్గల్లో కెంపువన్నెలు - ఈ దృశ్యం కన్నుల ముందు ఎక్కువ సేపు నిలవడం లేదు.

సగం కాలిన శరీరం జీవన్మరణాల మధ్య జరిగే అంతులేని సంఘర్షణ.

అంతస్థుకు మించిన సంబంధం చేసినందుకు తనమీద,

కోరినంత కట్నం తీసుకు రానందుకు తనను సజీవ దహనం చేసిన అత్తమామల మీదను

ఈ అన్యాయానికి, కిరాతకానికి భాగస్వామియైన తన భర్తమీద,

కాలిపోయిన కళ్ళల్లోంచి ఈ మానవ జాతిని శపిస్తున్న దృశ్యం తన కళ్ళ ముందు ఇంకా మసలుతూనే ఉంది.

తన బంగారు తల్లిని ఆ కసాయి వాళ్ళకు అప్ప చెప్పకుండా వుండవలసింది.

దురాశ దుఃఖానికి చేటు అయింది.

ఈ అప్పగింతల పాట - ఈ తతంగం గవర్నమెంటు నిషేధిస్తేనే గాని ఈ దేశం బాగుపడదు."

ఒక గాజుల చెయ్యి - పళ్ళెంలోంచి లడ్డూ తీసుకొంటోంది.

"అవి పెళ్ళివారికి" అంటూ మధ్యలో ఆగిపోయాడు.

తన వంక చూసి నవ్వుతూ "మేము కూడా పెళ్ళివారమే" అంటూ కిలకిలా నవ్వింది పెళ్ళికూతురు.

మాట్లాడకుండా చిరునవ్వుతో- రెండు లడ్డులు ఆ పిల్ల చేతిలో పెట్టాడు.

"ఆ సన్నాయి వాయించే అతన్ని ఒకసారి నేను పిలుస్తున్నానని చెప్పండి' అని అన్నది. లడ్డూ తీసుకొని లోపలికి వెళ్ళిపోయింది.

అనంతరామయ్య ఆ పిల్ల వెళ్ళిన దిక్కే చూస్తూ "మహాలక్ష్మమ్మా" అంటూ పిలిచాడు.

ప్రక్కన సామానుల కొట్టులో వస్తువులు సర్దుతున్న ఆ వ్యక్తి ఏమిటన్నట్టుగా ఈయన వంక చూసింది.

చూపు ఇటు వున్నా - మనస్సు శహన రాగం మీద వుంది.

ఈ రాగం తను చాలా సార్లు విన్నది. విన్నప్పుడల్లా అంతులేని కోపం వచ్చేది. తన మీదకాదు.

తనవారి మీద, తనను పుట్టించిన దేవుడి మీద! దుష్ట గడియలలో తనకు జన్మనిచ్చిన తల్లితండ్రుల మీద.

అందరి జీవితాలలో ఏదో ఒకనాడు అప్పగింతల పాట వస్తుంది. పాత గడిచి కొత్త వస్తుంది. నవ వసంతం వస్తుంది.

తనకు అందముంది, చందముంది. వయస్సుగడిచినా యవ్వనం తరగని రూపముంది. చూపుతోనే పురుషుడిని వశపరుచుకుని పరవశింప చేయగల నేర్పు వుంది.

తనకు నీడను యిస్తే వారికి కోటి అండదండలుగా వుండగల సామర్థ్యం వుంది.

"నాతి చరామి" అన్న తరువాత అన్య భావన మనస్సున చొరనీయని స్థైర్యం, ఆత్మనిగ్రహం తనకున్నాయి.

ఏం లాభం? ప్రొద్దువాలినా బ్రతుకు ఎండినా పాదాలకు మట్టెలు రాలేదు. మెడలో మంగళసూత్రం ముడిపడలేదు.

ఆడపుట్టుక పుట్టినా తన బ్రతుకు పుష్పించలేదు. ఫలించలేదు. ఎన్ని తేనెటీగలు ఆశలు రేకెత్తించినా తన ఆశలు మాత్రం తీరలేదు.

తన బ్రతుకులో అప్పగింతల పాట వినిపించలేదు.

అందరికీ తనే కావాలి - చాకిరీకి - మాటకు, మన్ననకు కాదు!!

ఈ పాట వింటూంటే తనకు మనుష్యులమీద అంతులేని కోపం వస్తుంది.

ముఖ్యంగా....

పెళ్ళి చెయ్యని తల్లి తండ్రుల మీద.

చిన్నప్పటి నుంచి తను పుట్టిన నాటినుంచి తనకు ఏదో ఒకనాడు భర్త అవుతాడని నమ్మిన బావ స్వయంగా మేనత్త కొడుకు, చివరిదాకా నమ్మించి ఒకనాడు స్వయంవరం చేసుకుని ఇల్లాలితో సహా ఇంటికి వచ్చాడు.

మహాలక్ష్మి సంగతి ఏమిటని నిగ్గతీసి అడిగితే-

"ఆ పిల్లను ఎప్పుడూ ఆ దృష్టితో చూడలేదు" అంటూ నంగనాచిలాగా బుకాయించాడు...

అంతే పుష్పించిన తన జీవితం ఫలించలేదు.

'మహాలక్ష్మమ్మా' అంటూ అనంతరామయ్యగారి కంఠం పలికింది.

"వస్తున్నా - ఎందుకా గావుకేకలు?" అంటూ అక్కడికి వచ్చింది.

"సింగారవేలుతో- పెళ్ళికూతురు పిలుస్తోంది లోపలికి రమ్మని చెప్పు" అని అన్నాడు.

శహన రాగం వింటున్న సంగీత సార్వభౌముడి మనస్సు గతంలోకి తొంగి చూస్తోంది.

పది సంవత్సరాలు...

కాలసాగరంలో ఒకనీటి బిందువు!!

మానవ జీవితంలో పది వసంతాలు ఎంతో విలువైన కాలం. క్రిందటి సారి ఈ నగరం వచ్చినప్పుడు, తన జీవితంలో సాధించవలసిన లక్ష్యాలు ఎన్నో వున్నాయి. ఎగర వేయవలసిన కీర్తి పతాకాలు ఎన్నో వున్నాయి.

కీర్తి లభించింది. సిరి సంపదలకి ఏ లోటు లేదు.

కాని... ప్రపంచం దృష్టిలో గెలిచినా నిజజీవితంలో ఓడిపోయాడు.

గురువుగారి దగ్గర ఎంతో కష్టపడి నేర్చుకున్న శహన రాగం ద్వారా తను ఎంతో కీర్తి గడించాడు.

తన శిష్యులందరిలో తెలివి గలవాడు. ఏదో ఒకనాడు తనని మించి పోగలిగిన శ్రీనివాస్‌కు ఈ రాగం ఎంతో జాగ్రత్తగా నేర్పాడు.

కొడుకైనా అల్లుడైనా అతనే అనుకున్నాడు. తన ఒక్కగానొక్క కూతురు మీనాక్షికి అతను అన్నివిధాల తగినవాడని పిల్లని అతని చేతిలో పెట్టి తను నిశ్చింతగా వుండవచ్చునని ఆశపడ్డాడు.

తన గురువుగారు శహన రాగం వాయిస్తూ వుంటే వారి సమక్షంలో మీనాక్షిని శ్రీనివాస్‌కు అప్పగిద్దామని ఎంతో ఉబలాటపడ్డాడు.

ఎన్నో తీయని కలలు కన్నాడు.

అనుకోకుండా గురువుగారు కాలం చేశారు.

తన కలలని ఛిన్నాభిన్నం చేస్తూ యధార్థాన్ని ఒక పీడకలగా మిగిల్చి తమ కులంకాని వాడితో లేచిపోయి మీనాక్షి రిజిష్టరు వివాహం చేసుకొన్ననాడు, మనుష్యులన్నా, మానవత్వమన్నా తనకు నమ్మకం పోయింది. అన్నింటికన్నా అన్యాయం, ఇంత విద్య ఇంతకాలం ఉచితంగా తన దగ్గర నేర్చుకున్న శ్రీనివాస్ ఏ మాత్రం కృతజ్ఞత లేకుండా తనని వదిలి పెళ్ళిళ్లలో సినిమాపాటలు వాయించే రాజరత్నం బృందంలో సన్నాయి వాడుగా చేరడం!

తనది రాతి గుండె.

కాని తన ఈ ఇల్లాలు యీ అన్యాయాలకి బలియై పోయింది. ఒకనాటి అసుర సంధ్యలో కైవల్యం చెందింది.

ఈ పాపాలన్నింటికి తనే కారణమన్నట్లు నలుగురూ నాలుగు మాటలు తనని అంటుంటే - ఈ పాపాలకి తను ఎలా బాధ్యుడో తెలిసేది కాదు.

అంతులేని ఒంటరితనం.

ఈ మందులేని వ్యాధికి శరణ్యం మైమరిపించే సంగీత సాధన.

కానీ వేళకాని వేళలో - వెల్లివిరిసే ఈ గాన లహరిని భరించలేక ఇరుగు పొరుగు వారు తనని మందలించిన సన్నివేశాలు ఎన్నో!

బంగారు పతకాలతో సన్నాయి ఏనాడో నిండిపోయింది. కాని - సాటి మానవులు చేసిన అన్యాయం మట్టుకు ఎదలో మిగిలిపోయింది.

"ఏ తీరున నను దయ జూచెదవో

ఇనవంశోత్తమ రామా"

నాదనామక్రియ వినగానే పెళ్లివారు ముఖముఖాలు చూసుకుంటూ ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్నారు.

ఇంతలో పెండ్లి కుమార్తె పిలుపు అతనికి చేరింది.

పాట ఆగింది.

పెండ్లి కుమార్తె దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు.

నవ్వుతూ ఏదో చెప్పింది.

చిరునవ్వుతో తిరిగి వచ్చాడు. అందరివంకా ఆనందంగా చూశాడు.

"పగలే వెన్నెలా

జగమే ఊయలా" అంటూ వాయించడం మొదలు పెట్టాడు.

పెళ్ళివారు తెప్పరిల్లుకునే లోపల

కంచిపట్టుచీరెతో పెండ్లి కూతురు - సూటులో పెళ్ళికొడుకూ వచ్చి కారులో కూర్చున్నారు.

కారు సుదూరాలకు కదిలింది.

"సర్వేజనా సుఖినోభవంతు

లోఖా స్సమస్తా సుఖినో భవంతు!" అంటూ పురోహితుడు లేచాడు. బంధువులందరికి కన్యాదాత నమస్కారం చేశాడు.

సన్నాయి పాట సంతోషంగా సాగిపోతోంది.

నీలికొండల నడుమ ఎయిర్‌కండిషన్ హోటలులో తెల్ల రంగు ఎర్ర అంచు పట్టుచీర, కురులలో విరిమల్లెలు, మదిలో ఎన్నో ఆశలు, ఊసులు.

స్నిగ్ధ మధురంగా పాలగ్లాసుతో అడుగుపెట్టిన చిన్నారిని సరసన కూర్చుండ బెట్టుకుని చెలికాడు ఆ తీయని వేళలో చేసిన తొలి కుశల ప్రశ్న,

"అప్పగింతల కార్యక్రమం రద్దు చేశావెందుకని?"

చిన్నది ఒక్కక్షణం అతని వంక చూసి తన చూపులు నీలి కొండల మీద నిలిపి...

"మన వివాహానికి కావలసిన ఏర్పాట్లు - కట్నకానుకలు పెండ్లి ఖర్చు - అన్ని నా స్వార్జితంలోనించి ఖర్చుపెట్టాను.

"వయసు వచ్చిన పిల్లకు పెండ్లి చెయ్యాలనే ఇంగితం లేని తండ్రి, పెండ్లి చేసుకుని నేను అత్తవారింటికి వెడితే యీ సంసారం గడవదేమోనని వచ్చిన సంబంధాలు చెడగొట్టిన పెద్దలు...

"వీళ్ళు మనస్ఫూర్తిగా నన్ను మీకు అప్పగిస్తారా? నాకు శుభం జరగాలని దీవిస్తారా?"

"చెరసాల వదిలి - స్వేచ్ఛ, సుఖ వాతావరణంలో నేను అడుగుపెట్టే ఈ శుభ తరుణంలో ఈ ఏడుపులు, పెడ బొబ్బలు ఎందుక?

"నాకు ఉల్లాసం - ఉత్సాహం - ఆనందం కావాలి. అందుకనే ఆపించాను శహనా రాగం

"నేను మీకు - మీరు నాకు

"సర్వహక్కులతో ఒకరికి ఒకరు అప్పగించుకునే శుభతరుణం ఇదే. దీనికి సాక్షులు అక్కర్లేదు. సన్నాయి మేళం అక్కర్లేదు. అందుకనే...."

మాటలు పూర్తికాకుండానే చేరువైన చిన్నదాన్ని నాథుడు చేరదీసుకున్నాడు.

పాల సముద్రం మీద పిండారబోసినట్టు వెన్నెల కాస్తోంది.

చిలుకలు - గోరువంకలు గూటికి చేరాయి.

ఆ మధుక్షణంలో వాళ్ళ జీవితాలలో తృతీయ పురుషార్థం నాంది పలికింది.

వాత్స్యాయనుడు మరొక కొత్త అధ్యాయం రాయడం మొదలు పెట్టాడు.